

# "చిన్నాంబి" ★

రచన: శ్రీ సాయిశ్రీ

ఆరోజు చిన్న జమిందారు మోహన్‌బాబు వస్తాడు. లలితా నగరమంతా ముఖ్యంగా జమిందారుగారి సౌధమంతా కలకలలాడు తుంది. కొన్ని సంవత్సరాలుగా దూరప్రదేశంలో విద్య నభ్యసించి, పరిపూర్ణత్వం పొంది వస్తున్నాడాయె! తనతర్వాత తన అంతవాడు! అలాంటప్పు డేతండ్రికి సంతోషం వుండదు? బాధ్యత లొప్పగించి "కృష్ణా! రామా!" అనుకుంటూ గడపా లనుకుంటున్న జమిందారుగారు కొడుక్కు ఘనంగా స్వాగత మివ్వాలని తీర్మానించారు. జమి అంతా అలంకరించాలని శాసించాడు.

నాల్గు అరేబియన్ గుఱ్ఱాల అద్దాలబండిలో బయలుదేరి వస్తున్న మోహన్‌బాబుకు సుస్వాగత మివ్వబడింది దారిపొడుగునా! కాబోయే జమిందారు, పైన దొరలచదువు చదివినవాడు ఇంక ఆరోజుల్లో - అదే 20 వ శతాబ్దపు తొలి రోజుల్లో - గౌరవ మర్యాదలకు లోటేమిటుంది?

జమిందారు గంగాధరరావుగారు, దివాన్లు, బంధువులు, వుద్యోగులు ఆనంద డోలికల్లో మునుగుతుండగా, మోహన్‌బాబు బండి దిగాడు. దిక్కులు పిక్కటిల్లేటట్లు అయిదు ఫిరంగిగుండ్లు పేల్చబడ్డాయి! విందులు, వినోదాలు, కచ్చేర్లసంగతి చెప్ప పన్లేదు. అంతా సందడే!

అంతా సద్దుమణిగేటప్పటికి చాల పొద్దు పోయింది. మోహన్‌బాబుకు నిద్రపట్టలేదు. దొర పైపు వెల్గించి, పచార్లు చేస్తున్నాడు గదిలో మెల్లగా. కాళ్ళు మేడమీదికి దారి తీసాయి! చల్లని మలయమారుతం అల్లనల్లన వచ్చి, అతని ముంగురులతో ఆడుకుంటుంది. అది నాల్గో అంతస్తు కాబట్టి అతనికి చుట్టుపట్ల వుండే పొలాలు, చెట్లు, చేమలు అన్నిటిని మించి వెన్నెల కన్నులవిందుగా వున్నాయి! రెండుసార్లు అటు ఇటు తిరిగాడు. దక్షిణపు వైపునుంచి లీలగా డప్పులమోత వినిపిస్తుంది. లయ తప్పకుండా అప్పుడప్పుడు ఈలలు విన్పిస్తున్నాయి! ఆవైపు కొండలలోయల్లో కోయ గూడెం వుంది. అక్కడినుంచే ఆ ధ్వని అనుకున్నాడు. "ఆ వైపు వెళ్ళితే కొంతతోస్తుంది." అనుకున్నాడు. దిగి క్రిందికివచ్చాడు. అంతా నిద్రపోతున్నారు. బారుతుపాకి భుజానికి తగిలించుకొని, తెల్లటిగుఱ్ఱాన్నెక్కి, మరునిమిషంలో వురకలెత్తించాడు దాన్ని. గూడెం దగ్గరయ్యేకొద్ది కోయసంగీతం ఎక్కువైంది:

"జియోజియో రిమిజియో
జియోజియో రిమిరిమిజియో
హెూనియా హెూనియా ఓహెూనియా
నియనియా....
అంబాల అంబాలా అంబలంబాలా
చిన్నాంబియాలో జిరియాలో
పింగళియాలో
హై - హై - ఓహై - ఓహెూహై....
అహా - ఇహ్హ - హ్హ - హా - జియో...."

పాట, డప్పులశబ్దం, ఈలలు, చప్పట్లు, వాటికి తగినట్లుగా నృత్యం చేస్తున్నారు కోయ యువకబృంధం!

తల మాణిక్యంలాగ మెర్సిపోతున్న కోయ నాయకుని కూతురియొక్క కన్నులసోయగం, కదలిక, శరీరం తిరిగే మెలికలు, కాళ్ళ గమనం, నాట్యమాడే నడుం అతన్ని మంత్ర ముగ్ధునిగా చేశాయి!........నాట్యం అయి పోయింది.

"షబాష్!' అన్న మాటతో కోయగూడెం అంతా గుఱ్ఱంమీద బాలచంద్రునిలాగ వెల్గిపోతున్న మోహన్‌బాబువైపు తిరిగారు. భుజానికి తగిలించుకొనివున్న తుపాకి. నిండు విగ్రహం, ఠీవి చూచి దిమ్మతిర్గిపోయారు వారంతా. 'ఎవరా' అనే ఆశ్చర్యం, ఆతురత, తెలియని భయం వాళ్లముఖాల్లో ముప్పిరిన పెనవేసుకున్నాయి !

"సలాములు! దొరబాబులు భద్రాచల వాసులు!" అంటూ కోయనాయకుడు ముందుకు అడుగువేశాడు. అతనివెంట అతని కూతురు, రెండవభార్య నడిచారు. కోయగుంపంతా 'సలాము!' అంటూ తలలు వంచారు అతని చుట్టుచేరి.

"వెట్టిమొగల్లారా అలా చూస్తారేం?" చిన్న దొరగార్రా! నేటికిరాలా? కాబోయే లలితానగరపు దొరలు!" అని నాయకు డనగానే 'అవునవును' అంటూ తలలూపారు గొఱ్ఱెలమంద లాగ అంతా.

"చాలా బాగుంది మీడాన్సు! దాని కిదిగో బహుమతి అని చేతి వజ్రపుటుంగరం విసిరాడు కోయనాయకునివైపు. అతని ముఖారవిందంలోని తేనె జుఱ్ఱుతున్న ఆ సీతాకోక చిలుక అట్టే దాన్ని ఎగిరి అందుకుంది. ఆ కుదుపుకు మెళ్ళోని పచ్చల పతాకంకూడా ఎగిరి రంగులు విరజిమ్మింది. "చిన్నాంబికి పెద్ద అదృష్టం!"అన్నాడు కోయదొర కూతుర్ని చూస్తూ. అంతకన్నా ఆ రెండు లేతహృదయాలు ఎంతో ఆనందిస్తున్నాయని అతనికి తెలేదు.

మరునాడు ఉషస్సునే వాహ్యాళికి బయలు దేరాడే కాని, మనస్సంతా ఆ రాత్రిదృశ్యమే కన్పిస్తుంది. చిన్నాంబి చిన్మయరూప చిద్విలాసం కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. అతని ఆలోచనలకు, గుఱ్ఱపు నడకలకు సంబంధం లేకుండానే వాటి మార్గాల్లో అవి పోతున్నాయి! అతను కోయగూడెం దగ్గరున్న సెలయేటిదగ్గరికి చేరాడు అనుకోకుండానే! హయ రాజం చోదకుని హృదయరాజాన్నను సరించిందేమో! మోహన్‌బాబు గుఱ్ఱాన్ని మెడ దగ్గర మృదువుగా చరిచాడు. అది సంతోషంతో సకిలింది గట్టిగా.

ఆ ధ్వని చిన్నాంబి కర్ణభేరికి సోకగానే ఆమె హృదయం స్పందించి, ఉరకలేసింది. మనస్సు తేలికపడింది. రాత్రి ఎంత భారంగా నడిచిందో మర్చిపోయింది. ఒక్క వుదుటున ఆవైపు లేడిలాగ పరువుతీసింది. చూపులు కలవాలేగాని హృదయాలు వాటంత టవే ఒకటౌతాయి ఎక్కడున్నా సరే! ఇది సత్యం!

★ ★ ★

"చిన్నాంబీ! ఈడమాటేశావేం? ఏదైనా సింగంవస్తుందా ఈ గుహలోకి?"

"నీకేటికి?" అంది ముఖం చిట్లించుకొని వులిక్కిపడి చిన్నాంబి.

"ఏటికా? నీ ఆట కట్టటానికే! పెట్టా! నీ చిన్నెలు నాకెరుకే."

"ఏంటి కూస్తా? అప్పతో చెప్పి పంబ రేపుతా! కాచుకో!"

"ఒసీ! ఒక్కటేసి. ఆ పుంజును, ఈ పెట్టను అప్పేదుట దొర్లిత్తే గప్పాయిబుడుంగు మంటాయి గోదావర్లో!" అంటూ చేతిలోని వాడిబాణాన్ని చిన్నాంబి కళ్లముందు తిప్పాడు కోయచిన్నవాడు మీసం మెలిపెట్టుతూ.

ఆ కోయగూడెం చిన్నాంబితండ్రి నాయకత్వంతోను, ఈ కోయవానిజబ్బ సత్తువతోను పెరుగుతుంది. వాడికి చిన్నాంబిని కల్యాణం చేసుకోవాలని మనస్సులో. అన్ని అనుకూలంగానేవున్నాయి! ఆర్రాత్రి మోహన్‌బాబురాకతో, చిన్నాంబిమనస్సు అతనివైపు మొగ్గింది. ఆరునెల్లనుంచి వాళ్లిద్దరిమధ్య ప్రతిరోజు గూడెం దగ్గరగావున్న కొండగుట్టల్లోని ఒక గృహం దగ్గర కల్సుకోటం ఈ కోయ చిన్ననాయకుడు పసికట్టాడు. చిన్నాంబి మాటతీరు కట్టు, బొట్టు కూడా మారజొచ్చింది. దీన్ని కూడా అతను పసిగట్టకపోలేదు!

"నాకు బొట్టుకట్టె దొరను నన్నే ఎన్నుకోమన్నాడు అప్పు! ఇందులో నీ పెత్తనం కట్టిపెట్టు మాట జారకు" అన్నది చిన్నాంబి కోపంతో.

ఇంతలో గుఱ్ఱం ఏఱుదాటుతూ సకిలించిన శబ్దం విన్నది చిన్నాంబి.

"కొట్టికూస్తానే పెట్టా! ఆయువుమూడిందే ఆ దొరగాడికి" అంటూనే బాణాన్ని రివ్వున వదిలాడు. అనుకోకుండా జరిగిన దానికి చిన్నాంబిమనస్సు కుతకుతా ఉడికిపోయింది. కోయవాడు జబ్బచరుచుకుంటూ "హి-హి" అంటూ పండ్లు యికిలించాడు. "దెబ్బతో అయ్య ఎట్లోపడి గోదావర్లో తొంగుంటాడు" అన్నాడు కూడా. ప్రేమ, యీర్ష్య పక్కపక్కనే పెరుగుతాయి!

రెప్పపాటులో హయరాజం రాబోయే అపద గుర్తించి పక్కకుగెంతింది. అయినా బాణం ఎడంచేతికి గుచ్చుకుంది. మోహన్‌బాబు రుద్రుడై తుపాకి పైకెత్తి, బాణంవచ్చినవైపు గురిచూచి మీటనొక్కాడు. మరుసెకండులో చిన్నకోయ "అయ్యో!" అని అర్చి క్రిందికి దొర్లాడు.

చిన్నాంబి, మోహన్‌బాబు ఇద్దరు ఒకేసారి చిన్నకోయ పడివున్నచోటికి వచ్చారు. తుపాకిధ్వనికి గూడెంలోని కొందరు ఆ వైపు పరుగెత్తుకొనివచ్చారు. అసరికే చిన్నకోయ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి! మోహన్‌బాబు చేతిలోని బాణాన్ని మెల్లగతీసి, ఏదో ఆకుపసరువేసి కట్టుకడుతోంది చిన్నాంబి.

పూసగుచ్చినట్లు అంతా చిన్నాంబి చెప్పగా విని, కోయనాయకుడు "దొరబాబులు చమించాలి! మీపైన బాణంవేసినందుకు వాడనుభవించాడు వెంటనే! మమ్మల్ని చమించాలి! ఈ నేరానికి ఏమిచ్చుకోమంటే అదిచ్చుకుంటాం! అనుగరయించాలి! పెద్దదొర్లబాబులకు తెలిస్తే లంకదహనమే! రచ్చించాలి" అన్నాడు కోయనాయకుడు చేతులు జోడించి.

"మీకేం భయంలేదు. మీరేం చెల్లించుకోనక్కర్లేదు .... అభ్యంతరం లేకపోతే .... అబ్బా...." అని ఒక్కసారి మూలిగాడు మోహన్‌బాబు చేయిబాధతో.

"చెలవీండీ!...."

"చిన్నాంబిని జమీందారి కోడలిగా చేయండి!"

"ఆఁ!" అని అందరు ఆశ్చర్యానంతోపాలతో తేలిపోయారు. చిన్నాంబి సిగ్గుతో తల వంచుకుంది కడుపుచూచుకుంటూ.

అప్పటికే ఆమె గర్భిణి!

* * *

"ఏదో గొప్పవాడివయ్యావు అనుకుంటే తీరని మహాక్షోభం తెచ్చేటట్లున్నది నీ వ్యవహారం! మన అంతస్తెక్కడ? కోయదాని అంతస్తెక్కడ? నక్కకు నాగలోకప్రాప్తా? అటు సూర్యుడు ఇటు పొడిచినా, నా ప్రాణం వుండగా దాన్ని నాకోడలుగా అంగీకరించను" అని గర్జించాడు జమీందారు గంగాధరరావుగారు, అటు ఇటు తిరుగుతూ. ఆయన పదవిన్యాసానికి భూమి వణుకుతున్నట్లు వుంది. గొంతు కొండలోయల్లో మారుమ్రోగుతుంది!

"అంగీకరించరని మొదటే అనుకున్నా! నిజమైన ప్రేమను ఈనాడే కాదు, భూతకాలంలోకూడా ఎవరు అంగీకరించలేదు. తమ మంకుపట్టుతో ప్రేమికుల హృదయాలు చీల్చుతారు పెద్దలు. దాన్ని కాదన్నా వినరు. లాభం ఎవ్వరికిలేదు. ఆఖరున పశ్చాత్తాపం తప్ప ఇంకేమిలేదు! ఇది చరిత్ర చాటినదే! ఇంకోసారి దీన్నే వివరించదల్చుకున్నారనుకుంటా నాన్నగారు!" అన్నాడు చలించకుండా మోహన్‌బాబు. అంతసేపు జమీందారుగారు కిటికిలోనుంచి దూరంగా ఎక్కడో చూస్తున్నాడు. మోహన్‌బాబు పట్టినపట్టు వదిలేరకంకాదు. తండ్రిపోలికే!

"ఈ విషయంలో నీ బుద్ధి మార్చుకుంటే చచ్చి స్వర్గానున్న మీ అమ్మ సంతోషిస్తుంది!" అన్నాడు ఆఖరుమాటగా. తనకన్నా ఈ విషయంలో కొడుకు మొండి తేరాదని తెల్సుకొని కూడా! చాదస్తం!

"నేను యిష్టపడిన యువతిని చేసుకోవటంలో ఆమె అభ్యంతరమేమి వుండదనుకుంటా ఆమే కనుక బ్రతికివుంటే!"

జమిందారు ఒక లిప్తపాటు ఊరుకొని, "దీని ఫలితం చాల విషమంగావుంటుందని కుమారరాజాకు తెల్పుతున్నాం!" అన్నారు కసి హేళనమిళితంచేసి మోహన్‌బాబు వైపు తిరుగకుండానే.

"నా జీవితంలో ఇంకొకతెను చేసుకోను. ఆరు నూరైనా ఈ విషయంలో రాజాగారు అడ్డురాకుండుగాక అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నాడు చేతులు నడుంమీద నొక్కిపట్టుకొని భూమిమీద మునివేళ్ళతో లేస్తూ. తండ్రికిదగ్గ కొడుకే అనిపించాడు.

గంగాధరరావుగార్కి కళ్ళల్లో నిప్పులుతిరిగాయి! పళ్ళు పటపటలాడినాయి! పిడికెళ్ళు బిగించారు. ఉచ్ఛ్వాసనిశ్వాసలు చాలదీర్ఘములైనాయి! ఆయన వక్షస్థలం సముద్రపుటలల వలె ఎగిరి ఎగిరిపోతున్నది. ఆయన మేధస్సులో మేఘాలు ఘర్జిస్తున్నాయి! తుఫాన్ లేచింది. అది అగదు వర్షించకుండా!

"అయితే కుమారరాజా ఇక ఈ జమిలో వుండతగడు! తెల్లవారేలోపల ఈ ప్రాంతంలో తల కనపడిందా....అతడు నా కొడుకు అనే కనికరాలుండవు....అంతే!" అంటూ లోపలికిపోయారు తిరిగి చూడకుండా గబగబా.

ఒక్కసారి నిట్టూర్చి మోహన్‌బాబు తిరోముఖుడైనాడు. అతని ముఖంలో రక్తం గడ్డ కట్టుకొనివుంది. దివానులు, ఉన్నతాధికారులు గుడ్లు వప్పచెప్పి చూస్తున్నారే కాని ఒక్క మాటకూడా అనే ధైర్యం ఎవ్వరికి లేదు. రెండు పొట్టేళ్ళమధ్య తలదూర్చలేరు!

మోహన్‌బాబు తనగదిలో చాలసేపు అటు ఇటు తిరుగుతూ ఏదో ఆలోచిస్తు గడిపాడు. దూరంగా పన్నెండుగంటలు కొట్టింది. అతనికి నిద్రరావటం లేదు. ఎలావస్తుంది. అది మామూలురోజు కాదు!

"మూడుగంటలనుంచి ఈ ఆలోచనలు తెగటంలేదు. అర్ధరాత్రి అయింది! ఛట్!" అని గొణుక్కున్నాడు.

కాలం ఇంకో అరగంట జరిగింది. మోహన్‌బాబు నేరుగా తన గుఱ్ఱాన్నెక్కి ఒక్కసారి కళ్లెం సడలించి గదిమాడు. రివ్వున బాణంలాగ అది దక్షిణానికి దారితీసింది.

జమిందారు గంగాధరరావుకూడా నిద్ర పట్టలేదు. మోహన్‌బాబు పోతున్నవేపు కిటికీకుండా చూస్తూనే వున్నాడు. తర్వాత అతను తనభార్య చిత్తరువువైపు తిరిగాడు. కళ్ళు చింతనిప్పుల్లాగున్నాయి! ఆ ఎఱుపే దక్షిణ దిశనున్న ఆకాశం మీద ప్రతిఫలిస్తున్నదో యన్నట్లు, ఆకాశం అరుణవర్ణం దాల్చింది. కారణంలేంది ప్రకృతిరంగు మార్చదు.

* * *

కోయగూడెం అంతా ఆరోజు సాయంత్రపు సంఘటనతో సంచలనం బయలుదేరింది. గుసగుసలు ప్రారంభమైనాయి!

చిన్నాంబి, మోహన్‌బాబుల ప్రణయం కోయ చిన్ననాయకుని మరణం, కోయనాయకుడు చిన్నాంబిని మోహన్‌బాబుకిచ్చి పెండ్లి చేయడానికి ఒప్పుకోటం, కోయవారిలో అలజడి కల్గించింది. "చిన్నాంబి గర్భిణిట కూడా!" అన్నమాట తలకొకవిధంగా చెప్పుకున్నారు. ఆ రాత్రి చాల పొద్దుపోయిందాక ప్రతియింటా ఇదే చర్చనీయాంశం! కోయ చిన్ననాయకుని బలగంవాళ్ళు ఈ విషయంలో కారాలు మిరియాలు నూరుతున్నారు బహిరంగంగా కాకపోయినా, తమలో తామే. చిన్నాంబి అతన్నెలా చేసుకుంటుందో చూస్తాం అని తొడచరిచి, మీసం దువ్వినవారుకూడా వున్నారు. బహిరంగంగా అనే ధైర్యం ఎది?

గూడెం మాటుమణిగింది. ఉన్నట్లుండి పెద్దగా అరుపులు, ఏడ్పులు వినిపించసాగాయి! పెళపెళ మంటలతో గూడెం అంతా పట్టపగలైంది. తాటాకు గుడిశెలు మంటలలో దగ్ధమైపోతున్నాయి!

కోయలంతా మంటల వార్పాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నారు. నీళ్ళుపోసేకొద్దీ మంట లెక్కువౌతున్నాయి. గీబా-గీబా అంటు పిల్లల ఏడ్పులు, పశువుల అరుపులు పెద్దల హడావిడి అంతా గందరగోళంగా వుంది. ఈ సందడిలో కోయనాయకుని గురించికాని, అతని గుండెల్లోదిగిన బడిసెగురించిగాని, అతనిభార్య తల నరికివేసిన సంగతిగాని ఎవ్వరికి పట్టలేదు. కోయనాయకుని యిల్లు దగ్ధమైంది. దానిలోనే మృతకళేబరాలు అహుతి అయిపోయినాయి! గూడెం అంతా బూడిద అయింది. చెట్టుకొకరు పుట్టకొకరు పారిపోయారు. వారిగోడు చెప్పరానిదైంది. అది కాళరాత్రి!

అదే సమయంలో మోహన్‌బాబు గుఱ్ఱం సకిలిస్తూ సెలయేటి ఒడ్డుకొచ్చింది. ఆ సకిలింపు విని పాతికమంది రౌతులు పక్కనున్న చెట్లచాటుకు పోయారు. మోహన్‌బాబు గుఱ్ఱం దాటిపోగానే, వారు నగరంవైపు శరవేగంగా పరుగులెత్తించారు గుఱ్ఱాలను. నిశాచరులు!

మోహన్‌బాబు గూడెం చేరేటప్పటికి అంతా బూడిదైపోయింది. కోయనాయకుని యిల్లు నేలమట్టమై బూడిదరాసి అయింది. జనసంచారం లేదు. నానా భీభత్సంగా వుంది.

తానెవర్ని కల్సుకుందామని వచ్చాడో, ఆ చిన్నాంబి అతనికంటికక్కనిపించలేదు. ఒక్కరోజులో ఎన్ని మార్పులు? కోయ చిన్ననాయకుని కాల్చివేయటం, తండ్రితో తగవులాట, గూడెం కాలిపోవటం - ఎంత వక్రంగాతిరుగుతుంది కాలం? చిన్నాంబి బూడిదైపోయింది! ఈ దహనచర్యలకు కారణమెవరు? అక్కడ అతనికి జవాబు ఎవరుచెప్తారు? దైవం తన్ను చిన్నచూపు చూసింది. తన ప్రేమామృతం నేలపాలైంది. తన ప్రేమాధిదేవత దగ్ధమైంది. ఇక తన జీవితానికి అర్ధంలేదు. ఆలోచనలతో అతని మెదడు వుడికిపోయింది. పిచ్చి ఎత్తినట్లుంది. ప్రేమవ్యవహారమే అంత!

గుఱ్ఱాన్ని అదిలించాడు. దాని యిష్టమొచ్చినట్లు పోసాగింది. మనస్సు చలించింది. కమ్చీతో దాన్ని కొట్టుతూనే వున్నాడు. అది మనోవేగంగా పోతుంది. ఎక్కడికో? తెలియదు.

* * *

చిన్నాంబి కన్నులు తెర్చేటప్పటికి ఎవరో ఇంటిలో ప్రవేశించినట్లు కనుకొన్నది. సాయింత్రం జరిగిన సంఘటన మనస్సులో మెదలుతూనేవుంది. అందుకనే నిద్ర సరిగ్గా పట్టనేలేదు. తెల్లవారితే మోహన్‌బాబు వస్తాడు. తండ్రిని ఒప్పించి. తనకు ఈ ఒంటరిజీవితం రహస్యంగా కల్సుకోటం అనేవి వుండవు! తానెంత అదృష్టవంతురాలు! అలా అలల లాగ వస్తున్న ఆలోచనలతోనే ఒక్క కునుకు తీసి మేల్కొనేటప్పటికి, నల్లని దుస్తులు ధరించి నల్గురు మనుష్యులు లోపలికిరావటం చూచింది. రెప్పపాటులో ఒకడు తన తండ్రి గుండెలో బడిసె దించేశాడు. ప్రక్కనే ఇంకొంచెందూరంలో ముసుగుపెట్టుకొని నిద్రిస్తున్న తనసవతితల్లి తల నరికేశాడు ఇంకోడు. అరుద్దామనుకుంది. కాని అరిస్తే తనగతీ అంతే! తాను ఒక్కతె! వాళ్లు నలుగురు! అరవటంవల్ల ప్రాణభంగమే కాకుండా మానభంగం అవుతుంది! అన్నిటికన్నా తనకడుపులోని శిశువుగతేంకావాలి? కిక్కురుమనకుండా నోరు నొక్కుకుంది. అదృబతుకు.

"కోయనాయకుడు, వాడికూతురు సఫా అయ్యారు. జమిందారుగారి అజ్ఞప్రకారం ఆ కొంచెం అగ్గికూడా త్వరగా ముట్టిస్తే గొడవ తీరుతుంది." అన్నాడు ఇంకోడు బయటికి నడుస్తూ.

"ముందు ఈ ఇల్లే తగలెయ్యాలి! పనులు చకచక జరగాల!" అన్నదొకగొంతు అధికారంగా.

తానారోజు అటకమీద పండుకోటంవల్ల వారిబారిన పడలేదు. అందుకు చిన్నాంబి సంతోషించింది. కడసారి మృతశరీరాలకు నమస్కరించి, త్వరగా కిటికీకుండా బయట పడింది. ఆ వైపు పొదలు దట్టంగా వున్నాయి! వాటి చాటుకుండా అలా అలా ప్రాకుతూ పరుగిత్తింది ఎంతదూరం పరుగెత్తిందో అమెకే తెలీదు. ప్రాణభీతి అలాంటిది! తమవారు పెడుతున్న ఘోష లీలగా విన్పిస్తుంది. దూరంగా ఎఱ్ఱగా కన్పిస్తుంది. చిన్నాంబి పరుగెత్తుతూనేవుంది దిక్కుతెలీకుండానే!

తన కొడుకుమీద బాణం వేసినందుకు జమిందారు కక్షపూనాడనుకుంది కాని తన్ను ప్రేమించినందుకే అని తెలీదామెకు.

చివరకు కాళ్ళు నొప్పులుపుట్టి, ఆయాసంతో ఒక చెట్టుక్రింద కూర్చుంది. ఎప్పుడుపట్టిందో కాని కన్నులు తెర్చేటప్పటికి ఇద్దరు వృద్ధ కాపుదంపతులు ఆమెకు ఉపచారం చేస్తున్నారు. దిక్కులేనివారికి దైవమే దిక్కు!

* * *

మోహన్‌బాబు, వెఱ్ఱెత్తినట్లు పరుగెత్తుతున్న గుఱ్ఱంమీద అకాశంలో తేలుతూపోతున్నాడు. గుఱ్ఱం అల్సిపోయింది. కాని అతను కమ్చీతో కొట్టటం మానలేదు. గుఱ్ఱం ఎగవూపిరిపీలుస్తూ కొండలోయమలుపులో విర్చుకొనిపడింది ఆయాసంతో. అత నెగిరి క్రింద పడ్డాడు. నెత్తికి రాయితగిలి స్పృహతప్పిపోయాడు.

ప్రచండభానుని తీక్షణకిరణాలు అతనికి తగిలి మేల్కొల్పినాయి! అతనికి తన ఉనికి ఏమిటో తెలేలేదు. తలమీద రక్తం గడ్డకట్టుకొనిపోయింది. గుడ్డలంతా రక్తపుమరకలైనాయి! తలమీద తగిలినదెబ్బకు మెదడు చెదరి పూర్వపుస్మృతి బొత్తిగా లేకుండాపోయింది. తానెవరో అతనికి తెలియకుండాపోయింది. పాపం!

మెల్లగా తప్పటడుగులువేస్తూ నడుస్తున్నాడు! చాల నీరసంగా వుంది. వళ్లంతా నొప్పులు! దాహంవేస్తున్నది. కొంత దూరం నడిచి చెఱువుచేరాడు. దానిలోని నీటితో ముఖం శుభ్రపర్చుకొని, కడుపార నీళ్లు త్రాగాడు.

రక్తం చాలా పోవటంవల్ల నీరసం ఎక్కువైంది. ఆచెఱువుగట్టుమీదే నిద్రపోయాడు.

సూర్యుడు పడమటి సముద్రాన్ని చేరుకుంటున్నాడు. ఆ సమయంలో అరేబియా దేశస్థుల గుఱ్ఱపుదండునాయకుని కంట బడ్డాడతను. తన గుడారానికి మోయించుకొనిపోయి, కట్లుకట్టించాడు నాయకుడు. మూడో నాటికి కాని ఆతనికి తెలివిరాలేదు.

ఆ దండునాయకుడు ఖాశింబానిసవ్యాపారి! మంచి అందమైన యువతులను, బలమైన యువకులను అతను వదలడు. అతని గాయాలు నయంకాగానే, బానిసదుస్తులు తొడిగి, బానిసల్లో కలిపాడు. వారిలో మెరికల్లాంటివారు, రకరకాల భాషలవారు ఎందరో వున్నారు.

మోహన్‌బాబును ఎన్నో సంతల్లో అమ్మజూపాడు కాశిం. కాని అతనిలో చురుకుదనం లేదని ఎవ్వరు కొనలేదు. కొన్నవారు అతనికేమీ చేతకాదని, కాశింకుయిచ్చి, బదులుగా ఇంకొకర్ని తీసుకొనిపోయారు కొంత చెల్లించి.

కాశింకే విసుకెత్తింది. "చావల్ హరామ్ బే!" అనుకున్నాడు. రెండుమూడుసార్లు కొరడాలతో వీపు చితకబాదాడు బుద్ధివస్తుందని. కాని తన్నుకానట్లూరకున్నాడు మోహన్‌బాబు.

అఖరుకు ఒక జమిందారు గుఱ్ఱబ్బండి తోలటానికని కొన్నాడు. ఈపనిమాత్రం అతను చేయగలిగాడు. అందుకని అతన్ని వాపస్ చేయలేదు.

"కాశీం! నీవు అమ్మిన బానిస గుఱ్ఱాలను బాగా నడుపుతున్నాడు" అని మెచ్చుకున్నాడు జమిందారు.

"ఠీక్ హై సాబ్!" అని కాశిం సలాంచేసి వెళ్లిపోయాడు పీడవదిలిందని.

★ ★ ★

జమిందారు గంగాధరరావు తన సేవకులు చేసిన ఘనకార్యానికి పారితోషికంగా కొంత ధనం ముట్టచెప్పాడు. కుమారరాజా ఇప్పుడు ఎవర్ని చేసుకుంటాడు ? నాల్గురోజులు అలిగి ఐదో రోజున తిరిగి లలితానగరం చేరడా ? అలా సమర్ధించుకున్నాడు. అనాదిగా ప్రేమికులను విడతీసిన ఘనులంతా ఇలానే అనుకొని పప్పులో కాలేశామని తర్వాత తెల్సుకున్నారు ! ఈయనా అంతే !

ఒకటి, రెండు....అయిదు నెల్లు గడచినా మోహన్‌బాబుజాడ తెలియలేదు. సేవకులు తిరిగితిరిగి ముఖాలు వ్రేలాడేసుకొనివచ్చారు వృద్ధహృదయానికి ఆరాటం యెక్కువైంది. తల్లిలేని ఒక్కగానొక్క కొడుకును కళ్లలో పెట్టుకొని సాకి అఖరుకు దేశాలపాలుచేశానే అని ఆరాటపడ్డాడు. ఆ కోయపిల్లవల్లే తన కుమారుడు తనకు దూరమయ్యాడు. అందుకే కోయగూడెం సర్వనాశనం అయింది కూడా !

మనస్సు నిలవలేదింక. తానే ప్రయాణం కట్టాడు. అన్వేషణ సాగించాడు ఏడెనిమిది నెల్లు. అఖరుకు సీతానగరం చేరుకున్నాడు. ఆయన సిబ్బందంతా మోహన్‌బాబును గాల్లిస్తున్నారు. సాయంత్రానికి ఒకడు ఒకవార్త చేరవేశాడు. "ఆ కోయపిల్ల బ్రతికేవున్నది!" పిడుగులాంటివార్త !

దానితో తోకత్రొక్కిన పాములాగ లేచారు జమిందారు గంగాధరరావుగారు. వెంటనే పక్కనున్న తుపాకితీసుకొని, నాలుగుగుఱ్ఱాల బండినెక్కి, వాడితో బయలుదేరాడు.

"దిగండి బాబుగారు! ఇదొక కాపుమునలివానియిల్లు! వాడే ఆమెను చేరదీసి సాకుతున్నాడుట కూతురులాగ సంవత్సరన్నరనుంచి!"

పళ్ళు పటపట కొరుకుతూ జమిందారు మీసం మెలివేసి, బండిదిగాడు.

ఇంటితలుపువేసివుంది. సేవకుడు తలుపు కొట్టాడు. చిన్నాంబి తన ముద్దులపట్టి నెత్తుకొని తలుపుతీసింది. ఇప్పుడు ఆమె వేషబాషల్లో పూర్తి మార్పువచ్చింది. అది తెలెని జమీందారు 'ఆ కోయపిల్లేది?' అని గర్జించాడు లోపలికితోసుకొనివస్తూనే. 'మీరెవరు బాబూ?' అన్నది చిన్నాంబి కొడుకు నోటికి అడ్డంగా పెడుతున్నచేతిని పక్కకు తోస్తూ. వాడు జుట్టు పీకుతున్నాడు.

"అయ్యగారు లలితానగర్ జమిందార్లు! బాబుగారూ! ఈమే ఆ కోయపిల్ల!" అన్నాడు సేవకుడు.


"ఓహో! నీవేనా ఆ కోయదానివి ? నా కొడుకును నాశనంచేసిన పిశాచివి! నీ వల్లనే నా కొడుకు దేశాలపాలైనాడు! ఆ రోజే నిన్ను మారణంచేసి రమ్మన్నా ! వెధవలు నిన్ను చంపలేదు. ఇప్పుడెక్కడికి పోతావ్ ? నిన్ను కాల్చిపారేస్తే కాని నా కడుపుబాద తీర్గదు" అంటూ తుపాకిగొట్టం చిన్నాంబి కంఠానికి ఆనించాడు గంగాధరరావు.

"చెప్పు మోహన్ ఎక్కడ?" అని కళ్ళురిమాడు. ఆవేశం ఆయనకు అరింత లెక్కువ!

"నా-కు-తె-లేదు!" అన్నది బిత్తరపోతూ అనుకోని ఈ సంఘటనకు.

"తెలేదూ? ఊఁ! చెప్పు నిజం ! లేదా?.... ఒక్కదెబ్బతో ఎగిరిపోతుంది నీ ప్రాణం!" అని అర్చాడు జమిందారు కర్కశంగా !

చిన్నాంబికొడుకు, తల్లిమెడలోని గొలుసును గొట్టానికీ తగిల్చి నవ్వుతూ కేరింతలు కొట్టాడు బోసిగా. గొప్పపనిచేసనట్లు చప్పట్లు కొట్టాడు గొట్టాన్ని తోస్తూ. అల్లరివెధవ !



ఆ పసికందుపైకి పోయింది జమిందారి దృష్టి. తనకొడుకు మెక్కట్లు స్పష్టంగా కనుపిస్తున్నాయి! ఆ ముక్కు, నోరు, నొసలు, కన్నులు అంతా మోహన్‌బాబే! అతని చేయి వణకసాగింది. ఆ బిడ్డ తల్లిని రక్షించటానికో అన్నట్లు ఆ గొట్టాన్ని అవతలికి తోసేస్తున్నాడు. ఆయన చేతిలోని పటుత్వం సన్నగిల్లింది. ఆమె కంఠంనుంచి తుపాకి పక్కకు తొలిగింది. చంటివాడు ఆదేదో ఆట అనుకుంటున్నాడు. తల్లి చంకలోనుంచి ఎగురుతూ ఆ గొట్టాన్ని అందుకోబోతున్నాడు. అది అందకపోవటంవల్ల తల్లి మెళ్ళోని పచ్చలపతాకం గొలుసునుపట్టి లాగుతున్నాడు ఆ గొట్టందగ్గరికి తీసుకొనిపొమ్మన్నట్లు. చిన్నాంబినోటిలో తడి ఆరిపోయింది. ఆమెస్థితి అయోమయంగా వుంది !

జమిందార్ను ఏదోశక్తి వశపర్చుకుంటుంది! రక్తసంబంధం ఎక్కడున్నాలాగదూ? ఆ చంటివాని చేతిలోని పచ్చలపతాకపు గొలుసు మీదికిపోయిందతని దృష్టి! "ఎక్కడిదా గొల్సు?" అన్నాడాయన ఆశ్చర్యంతో, ఆతురతతో.

"ఇది నాదే!" అన్నది చిన్నాంబి కొంచెం తేరుకొని.

"నీదా? నీకెక్కడినుంచి వచ్చింది?" ఆయన కంఠంలో కఠినత హెచ్చుతుంది.

"నా చిన్ననాటినుంచి ఇది నా మెడలోనే వుందని మా అప్ప - తండ్రి - చెప్పేవాడు."

"ఏది ఇటుతే!" అన్నాడు అధికారంగా.

చిన్నాంబి తీసియిచ్చిన గొలుసు అటు ఇటు తిప్పి దానిమీది పేరు చదివాడు.

"నిజంచెప్పు! నీవా కోయవాని సొంత కూతురివేనా?"

"నేను కొండల్లో కోయనాయకునికి దొరికానట! అప్పుడే ఇది నా మెడలో వుందిట! ఆయన నన్ను పెంచుకున్నాడు కన్నతండ్రిలాగ!...."

"చంద్రా! ఎన్నిరోజులకు - ఎన్ని సంవత్సరాలకు కనిపించావమ్మా! నీకోసం నాచెల్లెలు బెంగతో చనిపోయింది. అయ్యో! ఎంత ఘోరానికి తలపడ్డావమ్మా! కోపంలో నిన్ను చంపేసుండేవాడిని ఆ పసికందు లేకపోయినట్లైతే! నీ కొడుక్కూ, నీ అన్నకు, నాకొడుక్కు ఎంత అన్యాయం చేసుండేవాడినో?'' అంటూ తుపాకిని విసిరేశాడు ఒకమూలకు. జమిందారు చేయిజాపేటప్పటికి చిన్నాంబి చంకలోనుంచి ఒక్క దూకుదూకాడు చంటివాడు. ఆయన వానిమీద ముద్దులవర్షం కురిపించాడు. చిన్నాంబి అర్థంకాక మొద్దుబారిపోయింది.

"మీ అన్న జయంత్ ఇప్పుడు చంపానగరపు జమీందారు. నీవు నా చెల్లెలి కూతురివి. నీవు రెండేళ్ల పిల్లవు. నీపేరు చంద్రకళ. నీవు మీ నాన్నతో వేటకెళ్తానని మారాంచేసావుట! నిన్ను తీసుకొని పోయాడు మీనాన్న. వేటలో ఆయనగుఱ్ఱం సేవకులకు దూరమైపోయింది. దానిమీద మీరిద్దరు ఎంతోదూరం పోయారు. ఏమైందో కాని మీ తండ్రి కళేబరం, గుఱ్ఱపు శవం కన్పించాయి! ఏ క్రూరమృగమో ఈ ఘోరకృత్యం చేసింది. ఆ బెంగతోనే మీఅమ్మ చనిపోయింది. నేనెంతో వెతికించాను నీ కోసం! నిన్ను రక్షించి కన్నకూతురిలా పెంచిన కోయనాయకుని చంపించాను కోపంతో. నా పాపానికి అంతువుంటుందా?" అన్నారు జమిందారు గంగాధరరావుగారు. ఆయన కంఠం కూరుకొనిపోయింది శోకంతో.

ఒకవైపు దుఃఖం పెల్లుబుకుతున్నా ఇంకోవైపు నూతనానుభూతిపొందించింది చిన్నాంబి కాదు - చంద్రకళ. తనకొక అన్న వున్నాడు! అతన్ని చూడాలని వువ్వెళ్ళూరింది. గంగాధర రావుగారు తన మేనమామ! "అంతా దైవ ఘటన!" అని అన్నది కళ్లుతుడుకుంటూ.

* * *

అంతా చంపానగరాన్ని అనుకొని ప్రవహిస్తున్న నది ఒడ్డునగల మామిడితోపులో వన భోజనాలకై బయలుదేరారు. ఎన్నో సంవత్సరాలుగా కనుపించని తన చెల్లెలు కనుపించటంవల్ల జయంత్ ప్రతిదినం పండగలాగ గడిపేస్తున్నాడు. మేనల్లుడు సుకుమార్‌తో గడపడంతోనే సరిపోతుందతనికి ఈ అయిదు రోజులనుంచి. మోహన్‌బాబు గురించి జాడ తెల్సుకోటానికి తన పరివారాన్ని తరిమాడు నలుమూలలకు. ఊఁ! అతనికెంతో సంతోషంగావుంది!

తోటలో నాలుగైలు పట్టుగుడారాలు వేయబడివున్నాయి! రకరకాల పక్షుల ధ్వనులతో నదీజలాల గలగలతో వాతావరణం అహ్లాదకరంగానే వున్నా, మోహన్‌బాబుజాడ ఎన్నిరోజులైనా తెలియకపోవడంవల్ల చంద్రకళ మనస్సు బాగోటంలేదు. కొంత తనవారిని కల్సుకోటంవల్ల సుకుమార్‌తోనూ మర్చిపోయినా అప్పుడప్పుడు మనస్సులో కలవరం బయలుదేరి గందరగోళం చేస్తుంది, అది మానసిపుణుండు.

అందరితోపాటు వెన్నెలలో భోజనం చేస్తున్నదే కాని ఆమె మనస్సు అక్కడలేదు. తన కొడుకును ఎత్తుకొని తనభర్త తనతోపాటు ఈ వెన్నెలలో తిరుగుతుంటే...........ఆ భాగ్యం తాను నోచుకోలేదా? అది ఊహాగానమేనా?

చెల్లెలి మనోవ్యథ గ్రహించిన జమిందారు జయంత్ ఆమెను సాధ్యమైనంతవరకు వినోదాల్లో గడిపేటట్లుచూస్తున్నాడు. పై పైపూతలు మనస్సులోని పుండును మాన్పలేవుగదా!

జమిందారి కుటుంబానికి సంబంధించిన వారి భోజనాలు అయిన తర్వాత సేవకులు భోజనాలు చేస్తున్నారు. చంద్రకళ కిటికిలోంచి బయటకుచూచి "మోహన్" అని విర్చుకొని పడింది. ఆ కేక జయంత్, గంగాదరరావు, మిగతా బంధువులు కంగారుగా అంతా ఆ వైపు వురుగెత్తారు. ఆమెకు స్పృహ లేదు. చన్నీళ్ళు ముఖాన చిలకరించి చూచారు తెలివిరాలేదు.

జమిందార్లిద్దరు చంద్రకళను గుఱ్ఱబ్బగ్గీలో ఎక్కించుకొని చంపానగరంవైపు బయలుదేరారు.

వైద్యుడు ఏదో మందువాసనచూపి స్మృతి తెప్పించాడు. "ఆయనేరి?" అంటూ లేచింది చంద్రకళ:

"ఎవరు?" అన్నారు జమిందార్లు ఒక్కసారే!

"మోహన్‌బాబు! నేను ఆయన్ను చూచాను అన్నాయి! మనతోటలో సేవకులతో పాటు భోంచేస్తున్నారు"

"కలవరించకమ్మా! మనస్సు కుదుట పర్చుకో!" అన్నాడు గంగాధరరావుగారు కన్ను లొత్తుకుంటూ.

"నేను కలవరించటం లేదండీ! ఆయనే! నేను చూచాను. నల్లగళ్ల చొక్కా, ఎఱ్ఱని లాగుతొడుక్కొని .... భుజానికి తాయత్తూ.... ఇంకా........"

''ఓసీ! వాడా! సింద్! మన గుఱ్ఱబ్బగ్గీతోలే వాడు! పొరపడ్డావ్! ఈమధ్యనే కొన్నా అరేబియా బానీసవర్తకునిదగ్గర. బాగానే వుంది!'' అన్నాడు జయంత్ నవ్వుతూ.

''ఎక్కడున్నారు?'' అంటూ చంద్రకళ లేచింది ఆత్రుతతో.

''నీకు పిచ్చిపట్టింది చెల్లీ! మన మోహన్ గుఱ్ఱబ్బగ్గీతోలే బానిసా? ఇంతెందుకుండు.... సింద్‌బాద్!'' అని కేకేశాడు జయంత్ బయటికి నడుస్తూ. అతనితో బాటే చంద్రకళ, గంగాధరరావుగారు, వైద్యుడు ఒకరివెనుక ఇంకొకరు నడిచారు బయటికి,

గుఱ్ఱబ్బగ్గీనానుకొని దీర్ఘంగా ఆలోచిస్తున్న సింద్‌బాద్ జయంత్ రెండోసారి పిల్చినప్పుడు ''జీ!'' అంటూ ఈ లోకంలో పడ్డాడు. వంగి సలాంచేస్తూ దరికివచ్చాడు.

''మోహన్! నన్ను గుర్తులేదూ?....ఏమిటీ వేషం?....నేను చిన్నాంబిని....'' అంటూ చంద్రకళ అతనివైపు పరుగెత్తింది.

''అమ్మగారు! నా పేరు సింద్‌బాద్!'' అన్నాడు నమ్రతతో.

''మామగారు! ఆయన నన్ను పూర్తిగా మర్చిపోయారు. మీరు చూడండి! ఆ తాయత్తు క్రింది ఆ నల్లటిమచ్చ....ఆరోజు కోయవాని బాణంవల్ల ఏర్పడిన గాయంతాలుకుది. నాకు బాగా తెల్సు! ఆయనే మోహన్‌బాబు చూడండి!'' అన్నది చంద్రకళ ఆవేశంతో

ఊగిపోతూ. వాతావరణం గుడ్డివెలుతురుగా వుంది. గంగాధరరావుగారు ముందు కొచ్చి పరిశీలనగా చూచి, అమాంతం అతన్ని కౌగలించుకున్నాడు 'మోహన్!' అంటూ.

సింద్‌బాద్ కొంచెం వెనక్కుతగ్గి 'బాబుగారూ! నాపేరు సింద్‌బాద్!'' అన్నాడు విసుగ్గా మొఖంపెట్టి. జయంత్‌కు ఏమి అర్ధంకాలేదు. మోహన్నుచూచి పదేళ్లపైనే అయిందాయె! గుర్తు ఎలా వుంటుంది? ఒకవేళ అతనే మోహన్ అయితే తనదగ్గర ఎందుకని మరుగు పర్చుకుంటాడు?

"ఆరోజు వెన్నెల్లో రాత్రిలో మా కోయగూడెం వచ్చారు గుఱ్ఱంమీద! నాపాటకు మెచ్చి, మీ చేతి ఉంగరం విసిరారు నావైపు. ఇదో ఆ వజ్రపు టుంగరం!'' అంటూ చంద్రకళ తనచేతి ఉంగరం చూపింది.

"అమ్మగారూ! నేను సింద్‌బాద్‌ను! మీరు పొరపడుతున్నారు. నాకు ఉంగరం ఎక్కడిది మీకివ్వటానికి? నేను బానిసను!'' అన్నాడు విసుగ్గా.

గంగాధరరావుగారుకూడా ఎన్నో ఆనవాళ్లు చెప్పి, 'నాయనా మోహన్! నీవు కొడుకువు' అన్నాడు.

దానిక్కూడా 'పొరపడుతున్నారు. నేను సింద్‌బాద్‌ను!' అన్నాడు నిశ్చలంగా.

కాని అతనిమెదడులో ఏదో సంచలనం కలుగుతుంది. విసుగుదల యెక్కువౌతుంది. వీరంతా తన్ను మోహన్‌అని పిలుస్తారేం? పిచ్చి యెత్తలేదుగదా? ఏదో పేరు కొనిపోయినదాని గురించి మెదడులో సంచలనం యెక్కువవుతుంది.

"ఇదుగోనండీ! మీ కుమారుడు! అంతా మీ పోలికే!'' అంటూ చంద్రకళ సుకుమార్‌ను దగ్గరికి యెత్తుకొనిపోయింది.

"నేను సింద్‌బాద్‌ను! సింద్‌బాద్‌ను! మీరు పూర్తిగా పొరపడుతున్నారు అంతే!'' అంటూ అరిచాడు కోపంగా.

అతను అంతకోపంగా అరవటం జయంత్ ఎన్నడూ వినలేదు.

"అమ్మా! నిజంగా మీరు అనుకున్నట్లు ఇతనే మోహన్‌బాబు అయితే అతనికి తప్పక మతి చలించివుండాలి! మీ రిలా ఎన్ని గుర్తులు చెప్పినా అతనికి పూర్వపు స్మృతి రావటం కష్టం! ఏ కారణంవల్ల మతి చలించిందో అదేరకంగా జరిగితేగాని అతనికి జ్ఞప్తి రాదు'' అన్నాడు వైద్యుడు గట్టిగా నశ్యం పీలుస్తూ. అందరు నిస్సహాయంగా సింద్‌బాద్‌ను చూచారు. అతనాకాశంవైపు చూస్తున్నాడు.

చంద్రకళ "ఆయనకు ప్రియమైన పాటొకటుంది అని పాడుతా .... కొంచెమన్నా గుర్తుకొస్తుందేమో....'' అంటూ పాడింది.

"మనసులోని మాటలే
మోముపైన మొల్చునులే
తెలియదనుకుంటావేమో
తెలుసునులే
పాడుచు ఆటాడుచు
వచ్చుచున్నది చిన్నది
మనసులోని మర్మమునే
చెప్పజాలనన్నది
కల్లకపటా మెరుగని
కోయపడుచు నన్నది
కోర్కెలన్ని తీర్చగానే
కొంటె జాణనన్నది....''

సింద్‌బాద్ ఆమె పాడుతున్నంతసేపు చాల ఆరాటపడ్డాడు. చేతులు, కాళ్ళు బిగతీసుకున్నాడు. ముగియగానే 'చట్!' అంటూ పరుగెత్తాడు. అతనికి పిచ్చెత్తినట్లుంది.

గుఱ్ఱంపైకి ఛంగునదూకి దాన్ని అదిలించాడు. బదబదా దాన్ని బాదాడు కమ్చీతో. అది వెక్కుపెట్టి విడిచిన బాణంలాగ దూసుకొనిపోయింది. అతనివెంట జయంత్, గంగాధరరావు గుఱ్ఱాలమీద పరుగెత్తారు.

అతను కమ్చీతో కొట్టూనేవున్నాడు. గుఱ్ఱం అలసిపోతున్నది. అతను పళ్ళు బిగించి గుఱ్ఱాన్ని కాలిమడిమలతో కుమ్ముతూవున్నాడు, జమిందార్లిద్దరు అతన్ని కల్సుకోలేకపోయారు. అతని గుఱ్ఱం మేఘాలలో పరుగెత్తుతుంది. వారిమధ్య ఫర్లాంగుదూరం వుంది. అతని గుఱ్ఱం నురుగులు కక్కుతుంది. అతను మోదటం ఆపలేదు. ధారాపాతంగా అతని వంటినుండి, గుఱ్ఱంవంటినుండి చమటకారుతుంది.

జయంత్‌కూడా తన కుఱ్ఱాన్ని బాగా అదిలించాడు. జయంత్‌కు అతనికి మధ్యనున్న దూరం తగ్గజొచ్చింది. పదిగజాలు....ఐదు.... గజం దగ్గరికొచ్చింది మధ్యదూరం. అతని గుఱ్ఱం డొంకలోకి తిరిగింది రాజమార్గంవదలి. జయంత్ అడ్డుదారి త్రొక్కాడు.

చెట్టుక్రిందగా పోతుండగా, బాగా వంగిన కొమ్మకు తల తగిలింది ఢమ్మున. గుఱ్ఱం పోతూనేవుంది. అతను క్రింద పడిపోయాడు. ఆదే సమయానికి జయంత్ ఆ ప్రదేశం అడ్డుదారినచేరి, అతన్ని పడిపోకుండా పట్టుకోవడంవల్ల ప్రమాదం తప్పింది. అతనికి స్పృహ లేదు.

ఇంతలో గంగాధరరావుగారు ఆ ప్రదేశం చేరారు. వీరి వెనుకనే బయలుదేరిన గుఱ్ఱబ్బగ్గీలోంచి చంద్రకళ, వైద్యుడు దిగారు కొంచెం వెనకగా.

* * *

అర్ధరాత్రి! బయట పండువెన్నెలకాస్తుంది పిండారపోసినట్లు. కళ్ళల్లో వత్తులుపెట్టుకొని వున్న చంద్రకళ నోము పండిందో అన్నట్లు, "చిన్నాంబీ!.... చిన్నాంబీ!...'' అన్నాడు కలవరిస్తూ సింద్‌బాద్ - కాదు-మోహన్‌బాబు.

"ఏమండీ!''

"నేను బ్రతికేవున్నానా? ఎక్కడున్నాను?'' అన్నాడు కన్నులు తెరువకుండానే.

"ఇదో ఇక్కడే! కళ్లు తెరవండి!''

"చి-న్నాం-బీ!'' అన్నాడు కొద్దిగా కన్ను తెరుస్తూ ఒక్కొక్క అక్షరమే!

"మరి మన శి........''

"ఇదో తొట్టిలో నిద్రపోతున్నాడు....'' అంటూ కళ్ళుతుడుచుకుంది చిన్నాంబి - చంద్రకళ.

"అప్పుడే ఇంతవాడైనాడా? ఆ!....'' అంటూ లేచాడు మోహన్‌బాబు.

"ఆ! లేవకూడదు! ఎక్కువ మెదడుకు కష్టం కల్గించకండి! అలా చెప్పాడు వైద్యుడు.''

"ఫర్వాలేదు. నాకేం బాధలేదు. ఇన్ని రోజులు బిడ్డను చూచుకోని నేను ఎంత పాపినోకదా!'' అంటూలేచి నిద్రపోతున్న కొడుకును ఎత్తుకున్నాడు. వాడులేచి ఏడ్వటం మొదలుపెట్టాడు.

"నానాన్నే! ఏడ్వకమ్మా!....డీ....డీ....డీ..టా....టాటా....'' అంటూ ఇటూ అటూ వూచేటప్పటికి వాడు నవ్వుతూ కేరింతలుకొట్టాడు. వాడితోపాటు బోసిగా చందమామ నవ్వాడు. చంద్రకళ ఆనందంతో పరవశత్వం పొందింది. ఈ సందట్లో వాడు తండ్రిమీద ఉచ్చపోసి గర్వంగా నవ్వాడు.

"ఛీ' కొండె కోనంగీ!'' అంటూ తల్లిచేతికి ఇచ్చాడు మోహన్ వాడిని. చంద్రకళ పకపక నవ్వింది వాడినందుకుంటూ.

ఈ నవ్వులకు ప్రక్కగదిలో జయంత్ గంగాధరరావుగారు లోపలికివచ్చి, సంగతి తెల్సుకొని వారూ నవ్వేశారు.

అగది అంతా నవ్వులగది అయింది!

★